విభేదాలు సీఈసీతోనా?
మోదీ ప్రభుత్వంతోనా ?

- అరుణ్ గోయల్ రాజీనామాకు కారణమేంటి?
- ఆయన కూడా బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తారా?
- బీజేపీకి బ్రాంచిగా మారిన ఎన్నికల కమిషన్
- గోయల్ రాజీనామాపై ప్రతిపక్షాల ప్రశ్నలు

అరుణ్ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 10: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. గోయల్ రాజీనామాకు కారణంపై ప్రతిపక్షాలు బీజేపీ లక్ష్యంగా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గోయల్ రాజీనామాకు కారణం.. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో విభేదాలా? లేక మోదీ ప్రభుత్వంతో విభేదాలా? అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. అరుణ్ గోయల్ రాజీనామాకు నిజంగానే వ్యక్తిగత కారణాలు ఉన్నాయా? లేదంటే ఆయన కూడా కలకత్తా హైకోర్టు జడ్జిలాగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయబోతున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు.

పదేండ్లుగా ఈసీ ప్రైవేటీకరణ

గత పదేండ్లుగా ఎన్నికల కమిషన్ ప్రైవేటీకరణ జరిగిందని, ఇప్పుడది బీజేపీకి బ్రాంచిగా మారిపోయిందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఇప్పుడున్నది టీఎన్ శేషన్ కాలం నాటి ఈసీ కాదని అన్నారు.

అరుణ్ గోయల్‌కు సెల్యూట్: మమత

గోయల్‌పై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రశంసలు కురిపించారు. 'బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల కోసం కేంద్ర బలగాల మోహరింపుపై బీజేపీ ఒత్తిడికి లొంగని గోయల్‌కు సెల్యూట్ చేస్తున్నా. ఎన్నికల పేరుతో బీజేపీ ఏం చేయాలనుకుంటున్నదో దీనిని బట్టి రుజువవుతున్నది. కేవలం ఓట్లు దండుకోవడమే వాళ్లకు కావాలి' అని ఆమె విమర్శించారు.

15లోగా కొత్త కమిషనర్లు

ఖాళీగా ఉన్న రెండు ఎన్నికల కమిషనర్ పదవులను ఈనెల 15 లోగా భర్తీ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకోసం కేంద్ర న్యాయ శాఖ మంత్రి నేతృత్వంలోని కమిటీ ఒక్కో పదవికి ఐదుగురు పేర్లతో జాబితాను తయారుచేయనున్నది. ఆ తర్వాత ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన తర్వాత కమిషనర్లను రాష్ట్రపతి నియమించనున్నారు.

సీఈసీ అయ్యే అవకాశం ఉన్నా..!

అరుణ్ గోయల్ 1985 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. 2022 నవంబరులో ఈసీగా బాధ్యతలు చేపట్టారు. పదవీకాలం 2027 డిసెంబర్ 5 వరకు ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రస్తుత సీఈసీ రాజీవ్‌కుమార్ రిటైర్‌మెంట్ తర్వాత గోయల్‌కు సీఈసీగా అవకాశం ఉండేది. అయినప్పటికీ ఆయన ఎందుకు రాజీనామా చేశారనేది చర్చనీయాంశమైంది. ఎన్నికల సంఘంలో ముగ్గురు సభ్యులు ఉండాల్సి ఉండగా గత నెల అనూప్ చంద్ర రిటైర్ అయ్యారు.

ఎస్బీఐ అప్పీల్‌పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వివరాలను తెలిపేందుకు గడువు పెంచాలని కోరుతూ ఎస్బీఐ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపనున్నది. అలాగే గడువులోగా బాండ్ల వివరాలు ఈసీకి ఇవ్వకుండా సుప్రీంకోర్టు ఆదేశాల్ని ధిక్కరించిందని ఆరోపిస్తూ ఎస్బీఐకి వ్యతిరేకంగా దాఖలైన మరో రెండు పిటిషన్లపైనా కోర్టు విచారించనున్నది. ఇదివరకే ఏడీఆర్ ఎస్బీఐపై కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగా, ఆదివారం సీపీఎం కూడా మరో పిటిషన్ వేసింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల పట్ల ఎస్బీఐ 'ఉద్దేశపూర్వక అవిధేయత' చూపుతున్నదని సీపీఎం ఆరోపించింది. ఎన్నికల బాండ్ల పథకం చట్ట విరుద్ధమని పేర్కొంటూ.. 2019 ఏప్రిల్ 12 నుంచి ఇప్పటివరకు బాండ్ల అమ్మకాల వివరాల్ని మార్చి 6 నాటికల్లా ఈసీకి అందజేయాలని సుప్రీంకోర్టు ఎస్బీఐని ఆదేశించింది.

తృణమూల్ ఒంటరి పోరే

కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష 'ఇండియా' కూటమికి దీదీ షాక్

- పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 42 లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన
- కుదేలవుతున్న ప్రతిపక్ష కూటమి
- మొన్న నితీశ్, నేడు మమత ఝలక్
- మహారాష్ట్ర, కేరళలోనూ ముసలం
- జార్ఖండ్‌లో ఒంటరిగానే: సీపీఐ

కోల్‌కతాలో జరిగిన జనగర్జన సభలో మాట్లాడుతున్న సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: విపక్ష 'ఇండియా' కూటమికి పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ షాక్ ఇచ్చారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని ఇదివరకే ప్రకటించిన దీదీ.. ఆదివారం రాష్ట్రంలోని మొత్తం 42 లోక్‌సభ సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో జరిగిన సభలో అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఈసారి 7 మంది సిట్టింగ్ ఎంపీలకు టికెట్ నిరాకరించిన దీదీ.. కొత్త ముఖాలను బరిలోకి దింపారు. 18 మంది మహిళలకు టికెట్లు ఇచ్చారు. మమత మేనల్లుడు, టీఎంసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ బెనర్జీ డైమండ్ హార్బర్ నుంచి పోటీ చేయనున్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లోని ఇద్దరు మంత్రులతోపాటు 9మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మమత లోక్‌సభ బరిలోకి దింపారు. పార్టీలో సీనియర్లు, జూనియర్ల మధ్య విభేదాల నేపథ్యంలో అభ్యర్థుల జాబితా రెండు గ్రూపుల మిశ్రమంగా కనిపించింది.

అధిర్ రంజన్‌పై యూసుఫ్ పఠాన్ పోటీ!

బహరాంపుర్ నుంచి మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్‌ను టీఎంసీ లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఐదుసార్లు ఎంపీగా గెలిచిన అధిర్ రంజన్ చౌదరికి బలమైన పట్టున్న స్థానం ఇది. ఈ నేపథ్యంలో బహరాంపుర్‌లో వీరిద్దరి మధ్య తీవ్రమైన పోటీ ఉండే అవకాశం ఉన్నది. మరో

రచనా బెనర్జీ

యూసుఫ్ పఠాన్

ప్రముఖ మాజీ క్రికెటర్ అయిన కీర్తి ఆజాద్‌కు టీఎంసీ దుర్గాపూర్ టికెట్ కేటాయించింది. ఇక హుగ్లీ నుంచి నటి రచనా బెనర్జీకి అవకాశం కల్పించారు. ఆమె తెలుగులో బావగారు బాగున్నారా?, కన్యాదానం, మావిడాకులు తదితర చిత్రాల్లో నటించారు.

మహువాకు టికెట్.. నుస్రత్‌కు హ్యాండ్

నటులు జూన్ మాలియా, దీపక్ అధికారి, శతాబ్ది రాయ్‌లకు తృణమూల్ టికెట్లు కేటాయించింది. అసన్‌సోల్ స్థానం నుంచి శత్రుఘ్నసిన్హా మళ్లీ బరిలోకి దిగనున్నారు. మరోవైపు పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై గత ఏడాది పార్లమెంట్ నుంచి బహిష్కరణకు గురైన మహువా మొయిత్రా కృష్ణానగర్ టికెట్ దక్కించుకొన్నారు. ఇటీవల రాష్ట్రంలో వివాదంగా మారిన సందేశ్‌ఖాలి ప్రాంతం ఉన్న బసిర్‌హత్ లోక్‌సభ స్థానంలో ప్రస్తుతం ఎంపీగా ఉన్న నటి నుస్రత్ జహాన్ స్థానంలో మాజీ ఎంపీ హాజి నురుల్ ఇస్లాంకు టీఎంసీ టికెట్ కేటాయించడం గమనార్హం.

గౌరవప్రద సీట్లు కోరుకున్నాం!

ఇండియా కూటమిలో భాగంగా ఉన్న టీఎంసీ.. తాను అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో అన్ని లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గౌరవప్రదమైన స్థానాల్లో పోటీకి సంబంధించి రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు జరుగాలని పదేపదే తమ పార్టీ కోరుకున్నదని, అయితే టీఎంసీ ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించిందన్నారు. మమతపై కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపిణీ ఒప్పందాన్ని కుదుర్చుకోకుండా మమత పీఎంవోకు(ప్రధాని కార్యాలయం) 'ఒక సందేశం' పంపారని అన్నారు. తన వంటి నాయకులను దేశంలోని ఏ రాజకీయ పార్టీ నమ్మకూడదని మమత నిరూపించారన్నారు. ఇండియా కూటమిలో కొనసాగితే, అది ప్రధాని మోదీకి నచ్చదనే భయం ఆమెలో ఉన్నదని, దీంతో కూటమి నుంచి దూరం పోవడం ద్వారా.. 'నా పట్ల అసంతృప్తిగా ఉండొద్దు. నేను బీజేపీకి వ్యతిరేకంగా నిలబడటం లేదు' అనే సందేశాన్ని మమత పీఎంవోకు ఇచ్చారని ఆరోపించారు.

'ఇండియా' కకావికలం

కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన విపక్ష ఇండియా కూటమి కకావికలమవుతున్నది. కాంగ్రెస్ తీరుతో మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా కూటమికి గుడ్‌బై చెబుతున్నాయి. బీహార్ సీఎం నితీశ్‌కుమార్.. ఇటీవలే బీజేపీ పక్షాన చేరారు. ఇక కేరళలో సీఎం విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రత్యర్థులుగా ఉన్నాయి. మహారాష్ట్రలోనూ ముసలం మొదలైంది. సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతుండగానే, ముంబై వాయువ్య సీటుకు శివసేన ఉద్ధవ్ వర్గం తాజాగా అభ్యర్థిని ప్రకటించడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు జార్ఖండ్‌లో 14కిగానూ 8 స్థానాల్లో ఒంటరిగానే పోటీచేస్తామని సీపీఐ ఆదివారం ప్రకటించింది. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ చర్చలు జరుపడం లేదని, అందుకే సొంతంగా పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకొన్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాఠక్ తెలిపారు.

భర్తలు మోదీ జపం చేస్తే భోజనం పెట్టొద్దు
మహిళలకు కేజ్రీవాల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 10: భర్తలు ప్రధాని నరేంద్ర మోదీ పేరు జపిస్తే వారికి రాత్రి భోజనం పెట్టొద్దని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మహిళలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలో మహిళా సమ్మాన్ సమారోహ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'చాలా మంది మగవాళ్లు మోదీ పేరు జపిస్తున్నారు. వారిని మీరు సరి చేయాలి. మోదీ పేరు జపిస్తే రాత్రి భోజనం పెట్టనని మీ భర్తలకు చెప్పండి' అని ఆయన అన్నారు. 'నేను కరెంటు, బస్ ప్రయాణం ఉచితంగా ఇచ్చాను. ఇప్పుడు ప్రతి నెలా మహిళలకు వెయ్యి రూపాయలు ఇస్తున్నా. బీజేపీ మహిళలకు ఏం చేసిందని వారికి ఓటేయాలి. ఈసారి కేజ్రీవాల్‌కు ఓటేయండి' అని అన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన అతివల జీవితాల్లో నిజమైన సాధికారత తెస్తుందన్నారు.

హెలికాప్టర్లకు ఫుల్ డిమాండ్!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో దేశంలో రాజకీయ వేడి పెరుగుతున్నది. రాజకీయ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ జెట్లు, విమానాలకు డిమాండ్ పెరుగుతున్నది. గత ఎన్నికల్లో కంటే ఈ సారి 40 శాతం డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. క్లబ్ వన్ ఎయిర్ సీఈవో రాజన్ మెహ్రా మాట్లాడుతూ, ప్రైవేట్ జెట్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. చార్టర్డ్ ప్లేన్స్, హెలికాప్టర్ల లభ్యత కన్నా ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది హెలికాప్టర్లను లీజుకు తీసుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. చార్టర్డ్ ప్లేన్‌కు గంటకు రూ.4.5 లక్షల నుంచి రూ.5.25 లక్షల వరకు వసూలు చేస్తారు. హెలికాప్టర్‌కు గంటకు రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తారు. ఈ ధరలు డిమాండ్‌ను బట్టి పెరగవచ్చునని ఓ ఎగ్జిక్యూటివ్ చెప్పారు.

మురాల చేతుల్లోకి హైతీ రాజధాని
3.62 లక్షల మంది వలసబాట

పోర్ట్ ఓ ప్రిన్స్, మార్చి 10: హైతీ రాజధాని పోర్ట్ ఓ ప్రిన్స్ క్రిమినల్ గ్యాంగుల చేతికి చిక్కింది. దీంతో చాలామంది ప్రజలు ఇండ్లను వదిలి వెళ్లిపోతున్నారు. దాదాపు 3,62,000 మంది వలసబాట పట్టారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. హైతీ ప్రజలు నిత్యం భయం గుప్పిట ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నదని, చాలా మంది ఇండ్లలో ఉండి తాళాలు వేసుకుంటున్నారని తెలిపింది. వీధివీధిలో సాయుధ దుండగులే కనిపిస్తున్నారని వెల్లడించింది. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లను ఆక్రమించేందుకు క్రిమినల్ గ్యాంగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అనేక దవాఖానలు వీరి చేతుల్లోకి చేరాయి.

రైతన్నల రైల్ రోకో
పంజాబ్‌లో రైళ్లకు అంతరాయం

చండీగఢ్, మార్చి 10: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, ఇతర డిమాండ్లతో పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో రైతులు ఆదివారం రైలు పట్టాలపై బైఠాయించి రైల్ రోకో నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఇచ్చిన పిలుపు మేరకు రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంజాబ్‌లోని 22 జిల్లాల్లో 52 ప్రదేశాల్లో రైల్ రోకో జరిపినట్టు రైతు సంఘం నేత శర్వణ్ పాంథేర్ తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తేవడానికే తామీ నిరసనలు చేపట్టినట్టు రైతు సంఘాలు ప్రకటించాయి.

రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు షాక్

జైపూర్/చండీగఢ్: రాజస్థాన్‌లో మాజీ మంత్రులు రాజేంద్ర యాదవ్, లాల్ చంద్ కటారియా, మాజీ ఎమ్మెల్యేలు రిచ్‌పాల్ మీర్దా, విజయ్‌పాల్ మీర్దా సహా పలువురు కాంగ్రెస్ కీలక నేతలు ఆదివారం బీజేపీలో చేరారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రైతుల పేరిట ఓట్లడుగుతూ కాంగ్రెస్ వారిని మోసం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. మరోవైపు, హర్యానాలోని హిస్సార్ బీజేపీ ఎంపీ బిజేంద్ర సింగ్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశానని ఆయన చెప్పారు.

'నెతన్యాహూ తీరు ఇజ్రాయెల్‌నే గాయపరుస్తున్నది'

న్యూయార్క్: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ వైఖరిపై అయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నెతన్యాహూ అనుసరిస్తున్న వైఖరి ఇజ్రాయెల్‌కు మంచి చేయడం కంటే ఆ దేశాన్ని ఎక్కువగా గాయపరుస్తున్నదని వ్యాఖ్యానించారు. 'నెతన్యాహూకు ఇజ్రాయెల్‌ను రక్షించుకునే హక్కు ఉంది. హమాస్‌పై పోరాటం చేసే హక్కు కూడా ఉంది. అయితే అతని చర్యల వల్ల అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నాయన్న విషయంపై ఆయన మరింత దృష్టిసారించాలి' అని బైడెన్ తెలిపారు.

2/3 మెజార్టీ ఇస్తే..
రాజ్యాంగాన్ని మార్చేస్తాం!

హిందువులకు అనుకూలంగా మారుస్తాం: బీజేపీ ఎంపీ హెగ్డే

అనంత్‌కుమార్ హెగ్డే

కర్వార్, మార్చి 10: భారత రాజ్యాంగం మార్పుపై కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పీఠికలో 'లౌకిక' అనే పదాన్ని తొలగిస్తామని గతంలో వ్యాఖ్యానించిన అనంత్‌కుమార్.. హిందువులకు అనుకూలంగా దేశ రాజ్యాంగాన్ని మార్చేస్తామని తాజాగా పేర్కొన్నారు. ఇందుకోసం బీజేపీకి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీ ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. కర్వార్‌లో జరిగిన ఓ సభలో ఎంపీ అనంత్‌కుమార్ మాట్లాడుతూ ' ఇదంతా జరుగాలంటే మోదీకి లోక్‌సభలో అధిక సీట్లు ఇవ్వాలి. బీజేపీకి లోక్‌సభ, రాజ్యసభలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల్లో 2/3 వంతుల మెజార్టీ ఉండాలి' అని పేర్కొన్నారు. ప్రధానంగా హిందూ సమాజాన్ని అణచివేసే లక్ష్యంతో పలు చట్టాలను తీసుకొచ్చిందని, ఇదంతా మారాలంటే ప్రస్తుతం ఉన్న మెజార్టీతో సాధ్యం కాదని అన్నారు.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400 కంటే ఎక్కువ సీట్లు గెలువడం ద్వారా, అది రాజ్యసభలో కూడా 2/3 మెజార్టీ సాధించేందుకు, అదే స్థాయిలో రాష్ట్రాల్లో అధికారం చేపట్టేందుకు ఉపకరిస్తుందని ఎంపీ అనంత్‌కుమార్ పేర్కొన్నారు. సీఏఏను దేశంలో అమలు చేసేందుకు కూడా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలువాల్సిన అవసరం ఉన్నదని ఎంపీ అన్నారు. లోక్‌సభలో సులభంగానే ఆమోదం పొందిన సీఏఏ బిల్లు.. రాజ్యసభలో ఆమోదం పొందేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒక సవరణ ద్వారా సీఏఏను అమలు చేయాలనే ప్రణాళికలో ఉన్నదని తెలిపారు.

ఇదే వాళ్ల అజెండా..కాంగ్రెస్ విమర్శ

ప్రస్తుత రాజ్యాంగాన్ని నాశనం చేసి, తిరిగి రాయాలనే బీజేపీ-ఆరెస్సెస్ దాచిపెట్టిన, మోసపూరిత అజెండా బయటపడిందని కాంగ్రెస్ విమర్శించింది. బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే వ్యాఖ్యలు ప్రధాని మోదీ, సంఘ్ పరివార్ 'అంతర్గత ఉద్దేశాన్ని' బహిరంగ పరిచిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో రహస్యంగా నియంతృత్వాన్ని అమలు చేసేందుకు మోదీ ప్రభుత్వం, బీజేపీ, ఆరెస్సెస్ ప్లాన్ వేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు.

అది బీజేపీ వైఖరి కాదు

రాజ్యాంగం మార్పుపై ఎంపీ హెగ్డే వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. అది అతని వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీ వైఖరిని ప్రతిబింబించబోదని కర్ణాటక బీజేపీ శాఖ ఎక్స్ పోస్టులో పేర్కొన్నది. రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలపై హెగ్డే వివరణ కోరినట్టు తెలిపింది.

రష్యా అణుదాడిని అడ్డుకున్న భారత్!

న్యూఢిల్లీ, మార్చి 10: ఉక్రెయిన్‌పై రష్యా అణుదాడికి సిద్ధమవగా, భారత్ దాన్ని నిలువరించినట్టు తాజా నివేదిక వెల్లడించింది. అమెరికా అధికారులను ఉటంకిస్తూ సీఎన్ఎన్ ఈ విషయం పేర్కొంది. రష్యా ఆక్రమిత ఖేర్సన్‌లోకి ఉక్రెయిన్ దళాలు చొచ్చుకొస్తుండడంతో రష్యా అణుమార్గాలను ఎంచుకోవడం ఖాయమని అమెరికా భావించినట్టు ఆ కథనం తెలిపింది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌పై దాడికి సాకుగా చూపేందుకు డర్టీ బాంబు థియరీని రష్యా తెరపైకి తెచ్చినట్టు పేర్కొన్నది. ఇందులో భాగంగానే ఉక్రెయిన్ డర్టీ బాంబు ప్రయోగానికి సిద్ధమవుతున్నదని రష్యా పదేపదే ఆరోపణలు చేసినట్టు అమెరికా అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తన మిత్రదేశాలను అప్రమత్తం చేసి రష్యాపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా అణ్వాయుధ ప్రయోగాన్ని నిలువరించాలని భావించింది. ఈ బాధ్యతను భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అప్పగించారు. వీరిద్దరూ చేసిన ప్రకటనలతో రష్యా తమ ప్రణాళికలను పక్కనపెట్టింది.

అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ 'లోక్‌పాల్' కొత్త చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ మాణిక్ రావు ఖాన్విల్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈఎఫ్‌టీఏతో స్వేచ్ఛా వాణిజ్యం

- నాలుగు యూరప్ దేశాల కూటమితో భారత్ ఒప్పందం
- రాబోయే 15 ఏండ్లలో రూ.8.27 లక్షల కోట్ల పెట్టుబడులు
- తక్కువ ధరకే స్విస్ వాచ్‌లు, చాక్లెట్లు, బిస్కెట్లు లభ్యం

న్యూఢిల్లీ, మార్చి 10: స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టీన్ దేశాలతో కూడిన యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ) రానున్న 15 ఏండ్లలో భారత్‌లో 100 బిలియన్ డాలర్ల (రూ.8,27,523 కోట్ల) పెట్టుబడులు పెట్టడంతోపాటు 10 లక్షల ఉద్యోగాలను సృష్టించనున్నది. ఇందుకు సంబంధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై భారత్, ఈఎఫ్‌టీఏ ఆదివారం సంతకాలు చేశాయి. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులకు ఊతమిచ్చేందుకు వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా) పేరుతో దీన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో దేశీయ పరిశ్రమల్లో తయారయ్యే అన్ని రకాల వస్తువులు ఎలాంటి సుంకం లేకుండానే ఈఎఫ్‌టీఏ దేశాల్లో అందుబాటులోకి రావడంతోపాటు ప్రాసెస్ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు పన్ను రాయితీలు లభిస్తాయి. కాగా, స్విట్జర్లాండ్ ఇప్పటికే ఈ ఏడాది జనవరి నుంచే అన్ని రకాల పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తొలగించింది. దీంతోస్విస్ వాచ్‌లు, చాక్లెట్లు, గడియారాలు భారత్‌లో తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి.

ఇంకెంత కాలం?
భద్రతా మండలిలో సంస్కరణలపై భారత్

న్యూయార్క్: ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కిచెప్పింది. న్యూయార్క్‌లో శనివారం జరిగిన ఐరాస 78వ సెషన్స్ ఇన్‌ఫార్మల్ సమావేశంలో తన గళాన్ని గట్టిగా వినిపించింది. మండలిలో సంస్కరణల కోసం 2000లో ప్రపంచ దేశాల నేతలు తీర్మానించారని, ఈ సంస్కరణల కోసం ఇంకా ఎంతకాలం వేచి చూడాలని భారత ప్రతినిధి ప్రశ్నించారు.

ఐదు కూనలకు జన్మనిచ్చిన 'గామిని'

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులోని 'గామిని' చీతా ఆదివారం ఐదు కూనలకు జన్మనిచ్చింది. కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఎక్స్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. 'కునోలో ఐదు చక్కని కూనలు! దక్షిణాఫ్రికా నుంచి తెచ్చిన ఐదేండ్ల గామిని ఇవాళ ఐదు పిల్లలకు జన్మనిచ్చింది' అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వీటితో కలిపి ప్రస్తుతం కునో పార్కులో చీతాల సంఖ్య 26కు చేరిందన్నారు. భారత్‌లో పిల్లలను ఈనిన నాలుగో చీతా గామిని కాగా, దక్షిణాఫ్రికా నుంచి తెచ్చినవాటిలో మొదటిదని ఆయన చెప్పారు. చీతాల పునరుద్ధరణ ప్రాజెక్ట్ కింద నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి మొత్తం 20 చీతాల్ని భారత్‌కు తీసుకురాగా, ఇందులో అనేకం మృత్యువాత పడ్డాయి.



ఎప్పటికీ పేలని వాటర్ బ్యాటరీలు!

కాన్‌బెర్రా : బ్యాటరీలకు సంబంధించిన ప్రధాన సమస్య వాటి భద్రత. రకరకాల కారణాల వల్ల బ్యాటరీలు పేలిపోయే ఘటనలు తరచూ జరుగుతుంటాయి. బ్యాటరీల భద్రతపై ఉన్న అనుమానాలే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి కూడా ప్రధాన అడ్డంకిగా మారింది.ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ సమస్యకు పరిష్కారంగా 'నీటి బ్యాటరీలు' తయారుచేశారు. వీటిని రీఛార్జ్ కూడా చేసుకోవచ్చు. సాధారణంగా బ్యాటరీల్లో వినియోగించే ఎలక్ట్రోలైట్ల బదులుగా వివిధ లవణాలు కలిపిన నీటిని వినియోగించడమే ఈ బ్యాటరీ ప్రత్యేకత. పైగా లిథియం, లెడ్ యాసిడ్ బ్యాటరీలతో పోల్చుకుంటే ఇవి చౌకగా తయారుచేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు.

కంటిలో సోలార్ ప్యానెల్స్!
కంటిచూపు పునరుద్ధరణకు కొత్త ఆలోచన

సిడ్నీ, మార్చి 10: వృద్ధాప్యం, కంటి సమస్యల కారణంగా కోల్పోయిన కంటిచూపును పునరుద్ధరించేందుకు ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు సరికొత్త ఆలోచన చేస్తున్నారు. న్యూరోప్రోస్థెటిక్ టెక్నాలజీ ద్వారా కంటిచూపును తీసుకురావచ్చని భావిస్తున్నారు. వినికిడి లోపం ఉన్న వారికి కోక్లియర్ ఇంప్లాంట్ ద్వారా చిన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని చెవి లోపలి భాగంలో అమర్చి వినికిడి నాడిని ప్రేరేపించి వినికిడి శక్తిని పెంచుతున్నట్టుగానే కంటిచూపునూ పునరుద్ధరించవచ్చని నమ్ముతున్నారు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ మేరకు ప్రయత్నాలు ప్రారంభించారు. కాంతిని గ్రహించే రెటీనాలోని కణాలు, ఫొటోరిసెప్టర్లు దెబ్బతిన్న వారిలో ఈ న్యూరోప్రోస్థెటిక్ టెక్నాలజీ ద్వారా కంటిచూపును పునరుద్ధరించే అవకాశం ఉందని వీరు చెప్తున్నారు. కనుబొమ్మలో కెమెరా సెన్సర్ చిప్‌ను పెట్టడం ద్వారా ఇది సాధ్యమవుతుందని భావిస్తున్నారు. అయితే, ఈ సెన్సర్‌ను ఛార్జ్ చేయాల్సి ఉంటుంది. ఒకసారి కనుబొమ్మలో అమర్చిన తర్వాత ఛార్జ్ చేయడం సాధ్యం కాదు. ఈ సమస్యకు పరిష్కారంగా కాంతిని విద్యుత్తుగా మార్చగలిగే అతి సూక్ష్మ సోలార్ ఫొటోవాల్టెక్ ప్యానళ్లను కూడా కంటిలో అమర్చాలని భావిస్తున్నారు. ఈ రెండు టెక్నాలజీలను అనుసంధానం చేయడం ద్వారా కంటిచూపును పునరుద్ధరించవచ్చని చెప్తున్నారు. అయితే, ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నది.

2025 చివరి నాటికి సముద్రయాన్

న్యూఢిల్లీ, మార్చి 10: 2025 చివరి నాటికి సముద్రయాన్ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరెణ్ రిజుజు వెల్లడించారు. పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన ఈ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. మనుషుల్ని సముద్రం లోపల 6 కిలోమీటర్ల లోతుకి తీసుకెళ్లే సమ్‌మెర్సిబుల్ మత్స్య ప్రాజెక్ట్ ట్రయల్స్ ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభమవుతాయని తెలిపారు. 'కాంతి కూడా ప్రయాణించని చోటికి మన మత్స్య మిషన్ వెళ్లనుంది' అని రిజుజు చెప్పారు. సముద్రయాన్ మిషన్‌ను 2021లో ప్రారంభించారు. హిందూ మహా సముద్రంలో 6 కిలోమీటర్ల లోతుకు ముగ్గురు శాస్త్రవేత్తలను పంపి పరిశోధనలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

35 వేలు పలికిన శివరాత్రి నిమ్మకాయ

ఈరోడ్: తమిళనాడులోని ఈరోడ్, శివగిరి గ్రామంలో ఉన్న పతపూశయన్ దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దేవాలయం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శివునికి ఓ నిమ్మకాయను, ఇతర పండ్లు, వస్తువులను సమర్పించడం ఇక్కడి ఆచారం. ఈ నిమ్మకాయను వేలంలో అమ్మకానికి పెట్టారు. ఈ వేలంలో 15 మంది భక్తులు పాల్గొన్నారు. ఈరోడ్‌కు చెందిన ఓ భక్తుడు దీనిని అత్యధికంగా రూ.35,000కు సొంతం చేసుకున్నారు. ఈ నిమ్మకాయను అర్చకుడు తీసుకెళ్లి, శివుని ముందు పెట్టి పూజ చేసి, మళ్లీ ఆ భక్తునికి అందజేశారు. ఈ నిమ్మకాయను సొంతం చేసుకున్నవారికి అనేక సంవత్సరాలపాటు ఆరోగ్యం, సంపద సిద్ధిస్తాయని భక్తులు విశ్వసిస్తున్నారు.

చోరీ చేసి పారిపోతూ బోరుబావిలో పడి..

న్యూఢిల్లీ: శనివారం రాత్రి ఢిల్లీలోని ఓ బోరు బావిలో పడిన గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడు. మృతుడు దొంగతనం చేసిన తర్వాత తప్పించుకొనే ప్రయత్నంలో బోరు బావిలో పడిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడిని రక్షించడానికి చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయని.. ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి ఆతిశీ ఎక్స్‌లో వెల్లడించారు. బోరు బావి గదికి తాళం వేసి ఉన్నా.. విరిగిన గోడ ఎక్కి యువకుడు ఆ గదిలోకి ప్రవేశించి ఉంటాడని భావిస్తున్నారు.